నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 2 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ఆసిఫాబాద్ టౌన్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాలి

ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ వర్ధంతి పోస్టర్ల విడుదల

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 1 : విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం తన నివాసంలో ఎస్టీయూ 2025 డైరీ, క్యాలెండర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న బడుగు బలహీన వర్గాల పిల్లలకు మెరుగైన విద్యనందించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. అనంతరం పీఆర్టీయూ డైరీని కూడా ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాణిక్‌రావు, తుకారాం, సంజయ్ కుమార్, సులేమాన్, సంతోశ్, లక్ష్మణ్, వినోద్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, నాయకులు నీసార్, హైమద్, శంకర్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ వర్ధంతి పోస్టర్ల విడుదల

జైనూర్, జనవరి 1 : మండల కేంద్రంలో ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ వర్ధంతి పోస్టర్లను ఎమ్మెల్యే కోవ లక్ష్మి విడుదల చేశారు. అనంతరం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. పలుచోట్ల దుకాణాలను పారంభించారు. అనంతరం ఆమె కార్యకర్తలతో మాట్లాడారు. ఈ నెల 6న ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జైనూర్ పర్యటన సందర్భంగా ద్విచక్ర వాహన ర్యాలీతో స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. జంగాంలో కొనసాగుతున్న జంగుబాయి దీక్ష కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్ను పటేల్, మాజీ వైస్ ఎంపీపీ, చీర్లె లక్ష్మణ్, సర్పంచుల సంఘం మాజీ మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, సిర్పూర్(యు) బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోడసం ధర్మరావ్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావ్, లింగాపూర్ మాజీ జడ్పీటీసీ లక్యా నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మెస్రం అంబాజీ రావ, ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ యుత్ మార్లవాయి సభ్యులు, సార్‌మేడి గణపత్, మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్, పావర్‌గూడ మాజీ సర్పంచ్ గేడం లక్ష్మణ్, నాయకులు పవన్ జన్నావార్, ఆత్రం శంకర్ కొలాం, జ్యోతిబాపులే మాలీ సంఘం మండల అధ్యక్షుడు పెట్కులే హుస్సేన్ పాల్గొన్నారు.

జైనూర్ : ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ వర్ధంతి పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖ అధికారి రామచందర్ నాయక్

ఆసిఫాబాద్ అంబేద్కర్ క్, జనవరి 1: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆసిఫాబాద్ కుమ్రం భీం జిల్లా రవాణాశాఖ అధికారి రామచందర్ నాయక్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలన్నారు. ఇక్కడ ఎంవీఐ మోహన్, ఏఎంవీఐ రాజమల్లు, కానిస్టేబుల్ వాజీద్, రవి కళాశాల సిబ్బంది సునీల్, సంతోశ్, ప్రసాద్ ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానలో పార్కింగ్ పాట్లు

- అంబులెన్స్‌లు వెళ్లేందుకు దారి దొరకని పరిస్థితి
- వైద్యకోసం వచ్చే రోగులు, బంధువులకూ తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

దవాఖానలో అంబులెన్స్ బయటకు రాకుండా పార్కింగ్ చేసిన వాహనాలు

అంబులెన్స్ అత్యవసరపు గేటుకు అడ్డుగానిలిపి ఉంచిన కారు

రాత్రి దవాఖాన ఎదుట నిలిపి ఉంచిన బైకులు

మంచిర్యాల హాస్పిటల్‌లో అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్న వైద్యులు, సిబ్బంది

మంచిర్యాల అర్బన్, జనవరి 1 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన వైద్యులు, సిబ్బందితో పాటు ఇతరులు ద్విచక్ర వాహనాలతో పాటు ఫోర్ వీలర్లను ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యం వేలాది మంది రోగులు, వారి బంధువులు ఆటోలు.. ఇతర వాహనాల్లో ఇక్కడికి వస్తుంటారు. వైద్య సిబ్బందితో పాటు రోగులు, వారి బంధువులు, అలాగే సుదూర ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు సైతం ఇదే దవాఖాన ఆవరణలో పార్కింగ్ చేయడం వల్ల తిప్పలు తప్పడం లేదు. కొన్నిసార్లు వాహనాలు నిలిపి లోపలికి వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకూ నిరీక్షించాల్సి వస్తున్నది. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లకూ దారి దొరకని దుస్థితి నెలకొంటున్నది.

అందుబాటులో లేని సిబ్బంది

అంబులెన్స్‌లో వచ్చే పేషెంట్లను దవాఖాన లోపలికి తీసుకెళ్లడానికి షేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది అందుబాటులో ఉండాలి. కానీ, ఇక్కడ ఎవరూ అందుబాటులో ఉండడం లేదని తెలుస్తున్నది. 108 అంబులెన్స్ సిబ్బందే స్ట్రెచర్ మీదనో లేక వీల్ చైర్‌లోనో రోగులను దవాఖానకు చేర్చుతున్నారు. కాగా, ఈ విషయమై అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అంబులెన్స్ వేచి ఉన్నా..

ఓ ఎమర్జెన్సీ కేసును బెల్లంపల్లికి చెందిన 108 అంబులెన్స్ సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. ఆ సమయంలో మెయిన్ గేటుకు అడ్డంగా దవాఖాన సిబ్బంది కారు నిలిపి ఉంది. కుయ్.. కుయ్.. అంటూ 3 నుంచి 5 నిమిషాల పాటు అక్కడే వేచి ఉన్నా.. ఆ వాహనాన్ని తీయలేదు. దీంతో చేసేదేమీ లేక 108 సిబ్బందే వీల్ చెయిర్ తీసుకొని రోగిని దవాఖానలోకి తీసుకెళ్లారు. ఇదంతా జరిగిన తర్వాత సంబంధిత కారు డ్రైవర్ వచ్చి దానిని తీస్తున్న క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది.

తెగ తాగేశారు

- 'కిక్కు'తో పాత సంవత్సరానికి వీడ్కోలు
- మంచిర్యాల జిల్లాలో రూ.7.70 కోట్లు, ఆసిఫాబాద్ జిల్లాలో రూ. 5 కోట్ల మద్యం అమ్మకాలు

మంచిర్యాల అర్బన్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 1 : మందు బాబులు తెగతాగేశారు. కిక్కుతో 2024కు వీడ్కోలు పలికి.. 2025కు ఘన స్వాగతం పలికారు. డిసెంబర్ 31న ఒక్క రోజే మంచిర్యాల జిల్లాలోని 79 మద్యం దుకాణాలు, 17 బార్ అండ్ రెస్టారెంట్లలో రూ. 7 కోట్ల 70 లక్షల మద్యం పై చిలుకు అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. 2023 డిసెంబర్ 31న రూ.6 కోట్ల 47 లక్షల మద్యం అమ్మకాలు జరగగా, ఈసారి అదనంగా రూ.కోటీ 23 లక్షలకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. అలాగే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రూ. 5.05 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

- ఏఎస్పీ చిత్తరంజన్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 1 : శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఏఎస్పీ చిత్తరంజన్ పేర్కొన్నారు. బుధవారం ఆసిఫాబాద్ డివిజన్ పోలీస్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. ఫిర్యాదుదారులు మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా పోలీసు అధికారులను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో డీఎస్పీగా పనిచేసిన కరుణాకర్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఐపీఎస్ పూర్తి చేసుకున్న చిత్తరంజన్ ఆసిఫాబాద్ డివిజన్ పోలీస్ అధికారిగా మొదటిసారి బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు సీఐ లు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ విప్ సుమన్, నాయకులు

కేటీఆర్‌ను కలిసిన బాల్క సుమన్, ఆర్ఎస్పీ

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మాజీ విప్ బాల్క సుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ క్యాలెండ్ ఆవిష్కరణలో పాల్గొన్నారు.

కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సమ్మె చేస్తున్న ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

ఉద్యోగుల సమ్మెకు మద్దతు

హాజీపూర్/నస్పూర్, జనవరి 1 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు బుధవారం టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో సభ్యులు మద్దతు తెలిపారు. గడియారం శ్రీహరి మాట్లాడుతూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలను టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు, ఉద్యోగుల ఐక్య సంఘాల అధ్యక్షులు మారం జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్రం సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, కోశాధికారి సతీశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు తిరుపతి, సంయుక్త కార్యదర్శులు సునీత, ప్రభు, వెంకటకృష్ణ, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో సభ్యులు కలెక్టర్ దీపక్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ సభావత్ మోతీలాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

తాండూర్, జనవరి 1 : బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని తాండూర్ మండలం రేపల్లెవాడలోని మహేశ్వరి, శ్రీరామ జిన్నింగ్ మిల్లుల్లోని సీసీఐలో ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లను నిలిపేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్దం భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. పత్తి, గింజల నిల్వలు పేరుకుపోవడం వల్ల తాత్కాలికంగా కొనుగోళ్లు బంద్ చేసినట్లు పేర్కొన్నారు. తిరిగి 6వ తేదీ నుంచి యథావిధిగా కొనుగోళ్లు చేపడుతామని, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

వేట కుక్కల దాడిలో 55 మేకలు మృతి

కోటపల్లి, జనవరి 1: నక్కలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లి శివారు అటవీ ప్రాంతంలో మేకల మందపై అడవి కుక్కలు దాడి చేయగా, 55 మేకలు మృతి చెందాయి. బ్రాహ్మణపల్లికి చెందిన ముల్కల వెంకటి తన మేకలను అటవీ ప్రాంతానికి మేత కోసం తీసుకెళ్లగా, కుక్కలు ఒక్కసారిగా మందపై దాడి చేశాయి. ఈ దాడిలో 55మేకలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 20 మేకలు కనబడకుండా పోయాయి. మృతి చెందిన మేకల విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు.

కాగజ్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మార్కెట్ కమిటీ కార్యాలయం ఖాళీ

- తమను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతులు

సెలవులపై కొందరు.. వేధిస్తున్నారని మరికొందరు గైర్హాజరు

కాగజ్‌నగర్, జనవరి 1 : కాగజ్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్నది. కొందరు ఏదో ఒక కారణం చెప్పి సెలవుపై ఉండగా.. మరికొందరు కాంట్రాక్టు ఉద్యోగులు పాలకవర్గం వేధిస్తూన్నారంటూ విధులకు రావడం లేదు. దీంతో ఆయా మండలాల నుంచి పనుల మీద వస్తున్న కౌలు రైతులకు తిప్పలు తప్పడం లేదు. పది రోజులుగా సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో రైతులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తున్నది. మంగళవారం కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో సెక్రటరీ ఓడెలును 'నమస్తే' ఫోన్‌లో సంప్రదించగా సిబ్బంది సెలవు ఉన్నారని, తను కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్‌లోని కార్యాలయంలో కౌలు రైతుల వివరాలు ఆన్ లైన్ చేస్తున్నానని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులు నలుగురు, రెగ్యులర్ ఉద్యోగులు ఇద్దరు కూడా విధులకు హాజరు కాకపోవడంతో కార్యాలయం ఖాళీగా దర్శనమిచ్చింది.

సిబ్బందిని తొలగించే కుట్ర?

కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో విధులు నిర్వర్తించే తమను తొలగించే కుట్రలో భాగంగానే పాలకవర్గం వేధిస్తున్నదని కాంట్రాక్టు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన సెక్రటరీ భాస్కర్ పాలకవర్గానికి అనుకూలంగా లేడని బెల్లంపల్లికి బదిలీ చేయించారని, కరీంనగర్‌లో విధులు నిర్వర్తించే ఓడెలును కాగజ్‌నగర్‌కు రప్పించారని వారు చెబుతున్నారు. పాలకవర్గం బంధువులు, అనుచరులకు ఉద్యోగాలు ఇప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, తమను తొలగించడానికి ఇప్పటికే తీర్మానం కూడా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతమున్న మార్కెట్ కమిటీ సెక్రటరీ ఓడెలు సమయపాలన పాటించడం లేదని, దూర ప్రాంతం నుంచి రాకపోకలు సాగిస్తున్నాడని, ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వ్యవసాయ మార్కెట్ కమిటీలో జరుగుతున్న ఘటనలపై విచారణ జరిపి సిబ్బందికి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.